సాక్షి
ప్రకాశం
బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025





### అన్నదాతలకు 'సహకారం' సంపూర్ణం

పొగాకు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య రైతులకు అండగా నిలిచింది. రూ.37 లక్షల అప్పుల్లో ఉన్న సంస్థని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పడిన పాలకవర్గం ప్రభుత్వ సహకారంతో రూ.4 కోట్ల లాభాల్లోకి తీసుకొచ్చింది.

- 8లో..



### కనీస పెన్షన్ అందించాలి

కేంద్ర ప్రభుత్వం కనీస పెన్షన్‌ను రూ.9 వేలకు పెంచాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. పెన్షనర్ల సమస్యలు పరిష్కరించనందుకు నిరసనగా కలెక్టరేట్ వద్ద పెన్షన్‌దారులు ధర్నా నిర్వహించారు.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
32/22

### వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

# సంక్షోభ మిర్చి!

- భారీగా పడిపోతున్న ధరలు
- గుంటూరు యార్డులో క్వింటా ధర రూ.12 వేలు దాటని వైనం
- కోల్డ్‌స్టోరేజీలకు చేరుతున్న మిర్చి నిల్వలు
- కష్టాల్లో మిర్చి రైతులు
- రైతును పట్టించుకోని ప్రభుత్వం
- పశ్చిమాన ఏర్పాటుకాని కొనుగోలు కేంద్రం
- జిల్లాలో 55,823 ఎకరాల్లో సాగు



మిర్చి పంట రైతుల కంట కన్నీరు పెట్టిస్తోంది. రెండేళ్లుగా లాభాలు చూసిన రైతులు నేడు గిట్టుబాటు ధర లభించక సంక్షోభంలో చిక్కుకుంటున్నారు. అకాల వర్షాలు, చీడపీడలు తట్టుకుని సాగుచేసినా పెట్టుబడి వ్యయం భరించి మార్కెట్‌కు తెస్తే నిరాశే ఎదురైంది. గుంటూరు మార్కెట్లో క్వింటాల్ ఎండుమిర్చి ధర రూ.12 వేలకు మించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరలు తగ్గడంతో మిర్చిని కోల్డ్ స్టోరేజీల్లో భద్రపరుస్తున్నారు. రానున్న రోజుల్లో మంచి రేటు వస్తుందన్న ఆశతో ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం సైతం వీరిని పట్టించుకోకపోవడంతో అల్లాడుతున్నారు.

| జిల్లాలో సాగు ఇలా... | |
|---|---|
| మండలం | ఖరీఫ్ సాగు (ఎకరాల్లో) |
| మార్కాపురం | 2657.52 |
| దోర్నాల | 5817.10 |
| పెద్దారవీడు | 4543.83 |
| వై.పాలెం | 10409.49 |
| త్రిపురాంతకం | 5767.35 |
| పుల్లలచెరువు | 8098.75 |
| గిద్దలూరు | 893.33 |
| రాచర్ల | 1086 |
| కొమరోలు | 152.31 |
| బేస్తవారిపేట | 910.59 |
| కంభం | 342.23 |
| అర్ధవీడు | 2207.97 |
| తర్లుపాడు | 1520.42 |
| దొనకొండ | 1386.30 |
| కురిచేడు | 2078.14 |
| ముండ్లమూరు | 2552.10 |
| దర్శి | 1331.42 |
| కొనకనమిట్ల | 765.01 |
| పొదిలి | 641.69 |
| తాళ్లూరు | 259.02 |
| నాగులుప్పలపాడు | 510.21 |
| చీమకుర్తి | 88.23 |
| మద్రిపూడి | 676.82 |
| హనుమంతునిపాడు | 57.77 |
| వెలిగండ్ల | 186.81 |
| కనిగిరి | 471 |
| కొండపి | 85.51 |
| సంతనూతలపాడు | 134.97 |
| పీసీపల్లి | 186.05 |

**మార్కాపురం:** మిర్చి రైతు కంట్లో కారం పడుతోంది. మార్కెట్ల గిట్టుబాటు ధర లభించక విలవిల్లాడిపోతున్నారు. గుంటూరు యార్డులోనే క్వింటా ధర రకాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.12 వేల మధ్య పలుకుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలైనా పశ్చిమ ప్రకాశంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు వ్యయప్రయాసలకోర్చి గుంటూరుకు వెళ్లి యార్డుల్లో అమ్ముకుందామన్నా గిట్టుబాటు ధర లేదు. దీంతో రైతు పరిస్థితి దయనీయంగా మారింది. ఆర్థికంగా కష్టనష్టాల పాలవుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది మిర్చి 55,823 ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పటికే 3 కోతలు పూర్తయ్యాయి. రైతులు అధిక దిగుబడులిచ్చే రకాలుగా భావిస్తున్న యూఎస్ 341, నంబర్ 5, 5831 తేజలో పలు రకాల మిర్చి వేశారు. ఎకరాకు సుమారు 10 నుంచి 12 వేల మొక్కలు నాటారు. కొంతమంది బోర్ల కింద కూడా మిర్చి సాగు చేశారు. ఎకరాకు సుమారుగా 15 నుంచి 18 క్వింటాళ్ల వరకూ దిగుబడి రావచ్చని అంచనా.

**పడిపోతున్న ధరలు**

గుంటూరు మార్కెట్ యార్డులో మిర్చి ధరలు క్రమంగా పడిపోతున్నాయి. క్వింటా మిర్చి ధర గత ఏడాది నవంబరు నెలలో రూ.18 వేల వరకూ పలికింది. అది నేడు రూ.12 వేలకు పడిపోయింది. ఈ ఏడాది ప్రకృతి సహకరించకపోవడం, తామర తెగులు ఆశించినా కష్టాలు పడి మిర్చి సాగు చేశారు. గతంతో పోలిస్తే దిగుబడి భారీగా పడిపోవడంతో ధరలు సైతం నేల చూపులు చూస్తున్నాయి. దీంతో రైతు దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. గుంటూరు మార్కెట్ యార్డులో గత ఏడాది నవంబరులో మిర్చి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రారంభ దశలో క్వింటా ధర రూ. 17 నుంచి 18 వేలు పలికింది. ఆ తర్వాత డిసెంబరు నాటికి రూ.15 వేలకు పతనమైంది. జనవరిలో రూ.14 వేలకు తగ్గింది. నేడు రూ.10 వేల నుంచి రూ.12 వేల మధ్య ధర పడిపోయింది. ఇదిలా ఉండగా క్వింటా మిర్చి ధర 2022–23లో రూ.20,500. 2023–24లో రూ.20 వేల వరకూ కొనుగోలు చేశారు. ప్రస్తుతం పరిస్థితి తలకిందులైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి గుంటూరు మార్కెట్ యార్డుకు మిర్చి నిలువలు ఎక్కువగా రావడంతో ధర తగ్గిపోతోంది. వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

**పట్టించుకోని కూటమి ప్రభుత్వం:**

కూటమి ప్రభుత్వం వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా మిర్చి రైతుల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు. అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లినా, నల్లతామర తెగులు ఆశించి దిగుబడి తగ్గినా మిర్చి రైతును గాలికొదిలేసింది. జిల్లాలో ఎక్కువగా మిర్చిని సాగుచేసే పశ్చిమ ప్రకాశంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టలేదు. మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం వైపు నుంచి స్పందన లేదు. దీంతో రైతులు మిర్చిని బస్తాల్లో పెట్టుకుని గుంటూరుకు వెళ్తున్నారు. గుంటూరుకు లారీ బాడుగ సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఖర్చవుతోంది. ఎకరా మిర్చి సాగుకు సుమారు రూ.లక్ష నుంచి రూ.1.15 లక్షల వరకూ ఖర్చుపెట్టారు. ఎకరాకు 15 క్వింటాళ్ల వరకూ దిగుబడులు రావచ్చని రైతులు భావిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మిర్చి ధర రూ.12 వేల లోపు ఉంది. మార్కెట్ యార్డులో తేజ, బాడిగ రకాల మిర్చిని ఎక్కువగా రైతులు తీసుకెళ్తున్నారు. ఈ రెండు రకాల ధరలు తగ్గిపోయాయి. తేజ టాప్ క్వాలిటీకి సుమారు రూ.12 వేల నుంచి రూ.13 వేల వరకూ ఉన్నట్లు తెలుస్తోంది. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో సరుకును సమీపంలోని కోల్డ్ స్టోరేజీల్లో భద్రపరుస్తున్నారు. నష్టాల పాలు కాకుండా ఉండేందుకు మంచి ధర కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

**ధర తగ్గిపోయింది**

గుంటూరు మార్కెట్ యార్డులోనే మిర్చి ధర అమాంతం పడిపోయింది. రోజు రోజుకూ ధర తగ్గిపోతోంది. ఈ ఏడాది నాలుగెకరాల్లో నేను మర్చిని సాగు చేశారు. ఇప్పుడు మూడో కోత కోశాను. గుంటూరు యార్డుకు ఫోన్‌చేసి అడిగితే క్వింటా రూ.10 వేలు మాత్రమే ధర ఉందంటున్నారు. ఇలా అయితే కష్టమే. మరో వైపు కూలీల ఖర్చులు కూడా బాగా పెరిగాయి. రోజుకు ఒక్కొక్కరికి రూ.450 నుంచి రూ.500 వరకూ కూలీ ఇచ్చి కోతలకు తీసుకెళ్తున్నాం.

– జానపాటి ఆవులయ్య, మిర్చి రైతు

**మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి**



మార్కాపురంలో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చాను. దీనిపై జిల్లా మార్కెటింగ్ శాఖాధికారులు స్పందించారు. మార్కాపురం మార్కెట్ యార్డును ఫంక్షనల్ మార్కెట్ యార్డుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇక్కడే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. వ్యవసాయ ఖర్చులు తగ్గుతాయి.

– గాలివెంకటరామిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

## న్యూస్‌రీల్

### గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు ఆహ్వానం

**ఒంగోలు వన్‌టౌన్:** రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025–2026 విద్యా సంవత్సరానికి 5వ తరగతికి ఇంగ్లిషు మాధ్యమం, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఇంగ్లిషు మాధ్యమంలో ప్రవేశానికి బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ జయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షల ద్వారా విద్యార్థుల ఎంపిక జరుగుతుందన్నారు. అర్హులైన అభ్యర్థులు మార్చి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇతర పూర్తి వివరాలకు గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6వ తేదీ ఉంటుందన్నారు. 5వ తరగతికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరానికి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### పనిచేయని ఈవీఎంలు బెంగళూరుకు తరలింపు



పనిచేయని ఈవీఎంల తరలింపులో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు

**ఒంగోలు సిటీ:** ఒంగోలులోని మామిడిపాలెం గోదాములో ఉన్న గత ఎన్నికల్లో పనిచేయని వీవీ ప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లను బెంగళూరులోని బెల్ కంపెనీకి అధికారులు మంగళవారం పంపించారు. జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అధికారులు ఈ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సంబంధించి వీవీ ప్యాట్లు 35, బ్యాలెట్ యూనిట్లు 16, కంట్రోల్ యూనిట్లు 10 కలిపి మొత్తం 61 యూనిట్లను బెల్ కంపెనీకి పంపించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ ఎలక్షన్ సెల్ రిప్రజెంటేటివ్ దామరాజు క్రాంతికుమార్, కోనేటి వెంకటరావు, గుర్రం సత్య నారాయణ, దండే శ్రీను, ఓ రసూల్, వెంకటస్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### మలేరియా ఆఫీసును సందర్శించిన డీడీ



జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి వెంకటేశ్వర్లుతో మాట్లాడుతున్న డీడీ రామనాథరావు

**ఒంగోలు సిటీ:** రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ (మలేరియా) రామనాథరావు జిల్లా మలేరియా ఆఫీసును మంగళవారం సందర్శించి రికార్డ్స్‌ను పరిశీలించారు. అనంతరం టంగుటూరు పీహెచ్‌సీని సందర్శించి, డెంగీ కేసులు వచ్చిన ఏరియాను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలసి ప్రస్తుతం జిల్లాలో అమలవుతున్న జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం గురించి వివరించారు. జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు పెరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి యన్.మధుసూదనరావుకు సూచించారు. సచివాలయం పరిధిలో ఏఎన్ఎంలు వెక్టార్ కంట్రోల్ యాప్ లో దోమల పెరుగుదల ప్రదేశాలను గుర్తించి అప్లోడ్ చేయించాల్సిందిగా సూచించారు. ఆయన వెంట డాక్టర్ శ్రావణ్ కుమార్, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# మెగా క్యాంపు వ్యాఖ్యలు హుందాగా ఉండాలి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



**యర్రగొండపాలెం:** సినిమా ఇండస్ట్రీలో ఉన్న కొంతమంది పెద్దలు, సినిమాల నుంచి రాజకీయాల్లోకి వచ్చిన కొంతమంది వ్యక్తులు సినిమా ఫక్షన్‌లలో మాట్లాడే సమయంలో వారి వ్యాఖ్యలు బాధ్యతగా, హుందాతనంగా ఉండేలా చూసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. కొంతమంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలను ఆయన మంగళవారం ఖండించారు. ఈ మధ్య కాలంలో పవన్ కల్యాణ్, చరణ్, తాజాగా చిరంజీవి, మెగా కాంపౌండ్ నుంచి వచ్చిన కొంతమంది హీరోలు అనేక సినిమా కార్యక్రమాలకు వచ్చిన సమయంలో వారి భాష చాలా జుగుప్సాకరంగా ఉందని అన్నారు. పరోక్షంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని కించపరిచేలా ముఖ్యంగా మా అధినాయకుడిని, ఎమ్మెల్యేలను, పార్టీ నాయకులను కించపరిచేలా వారి మాటలు ఉంటున్నాయన్నారు. వారేకాకుండా పక్క వారు మాట్లాడుతున్నా వారిని ఆపకుండా ఇంకా ప్రోత్సహిస్తున్న పరిస్థితి ఏర్పడుతోందని, ఇది సినిమా ఇండస్ట్రీకి చాలా ఇబ్బందికరమైందన్నారు. ఇండస్ట్రీ అనేది అందరి కలయిక అని, కొందరి కోసం పెట్టినది కాదని అన్నారు. ఈ విషయంపై సినిమా ఇండస్ట్రీ జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని, అంతర్గతంగా చర్చించుకోవాలన్నారు. ఈ వ్యాఖ్యలు ఒకరి కడుపు మంట కోసం, ఒకరి రాజకీయ స్వప్రయోజనం కోసమేనని, కేవలం మెగా కాంపౌండ్ నుంచి వచ్చిన హీరోల స్వప్రయోజనం కోసమని అన్నారు. వారు కోటి 32 లక్షల మంది ఓట్లు వేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని కించపరుస్తూ పదే పదే మాట్లాడమనేది మంచి పద్ధతికాదని, దీనికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఇండస్ట్రీ నుంచి వచ్చిన పెద్దలు ఇటీవల కాలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతున్నారని, వారి వ్యాఖ్యలు చూస్తే చాలా దిగజారి మాట్లాడుతున్నట్లు ఉందని అన్నారు. కచ్చితంగా దీన్ని సవరించుకోకపోతే చాలా ఇబ్బంది జరిగే అవకాశం ఉందని, సినిమాలో ఎమోషన్ మీరు చూపించినట్లే పార్టీలో ఉన్న మాలాంటి స్వాభిమానం కలిగిన నాయకులకు ఎమోషన్ ఉంటుందని, మా నాయకుడి కోసం మేము నిలబడతామని అన్నారు. సినిమా ఇండస్ట్రీని దగా చేస్తున్న వారిని ఆ ఇండస్ట్రీలో ఉన్న పెద్దలు గ్రహించాలన్నారు. కొంతమంది కోసమే ఈ ఇండస్ట్రీ అన్నట్లు వారు మాట్లాడుతున్న విధానాన్ని కూడా గమనించాలని కోరారు. ముఖ్యంగా మెగా హీరోలకు కూడా చెప్తున్నాం.. మీరు సినిమా నుంచి ఎదిగిన తరువాత మెగా జీరోలుగా పరిణితి చెందారని, మీరు సినిమా ఇండస్ట్రీలో మెగా హీరోలుగా ఉండాలని మేము కోరుకుంటున్నామని అన్నారు. మీరు ఈ మధ్య చేసిన కార్యక్రమాల ద్వారా దగా హీరోలుగా మారుతున్నారని, ఈ పంథాను మార్చుకోవాలని, మెగా హీరోలు దగా హీరోలుగా మారడమనేది మంచి పద్ధతి కాదన్నారు. ఇండ్రస్ట్రీకి, మీకు, ఈ సమాజానికి మంచిది కాదని హితవు పలికారు.

# 18 ఏళ్లు పైబడిన వారందరికీ క్యాన్సర్ స్క్రీనింగ్

- రాష్ట్ర ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ శ్యామల



డీఎంహెచ్‌వో టి.వెంకటేశ్వర్లుతో మాట్లాడుతున్న స్టేట్ ఎన్‌సీడీ నోడల్ అధికారి డాక్టర్ శ్యామల

**మద్దిపాడు:** క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను 18 సంవత్సరాలు పైబడిన వారందరికీ నిర్వహించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ విభాగం సీనియర్ నోడల్ అధికారి డాక్టర్ శ్యామల అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏడుగుండ్లపాడు, బసవన్నపాలెం గ్రామాల్లో జరుగుతున్న క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను మంగళవారం ఆయన ఆమె పరిశీలించారు. వైద్య సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి రోజుకు 25 నుంచి 30 కుటుంబాలు లేదా 60 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. బీపీ, షుగర్ పరీక్షలు కూడా చేయాలని ఆదేశించారు. ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ పరీక్ష చేసిన క్యాన్సర్ అనుమానితుల కేసులను వైద్యాధికారికి రెఫర్ చేయాలన్నారు. వైద్యాధికారి ఆ కేసులను జీజీహెచ్‌లో ఏర్పాటు చేసిన క్యాన్సర్ విభాగానికి తుది పరీక్షల కోసం పంపాలన్నారు. జిల్లా, వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమగ్ర ఆరోగ్య సర్వే నిర్వహించి బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలు ఇంటి వద్దే చేయాలన్నారు. క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఈనెల 17, 18 తేదీల్లో ప్రముఖ సినీ యాక్టర్ గౌతమి ఒక ప్రోమో తయారు చేసేందుకు రానున్నట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. వారి వెంట డాక్టర్ సురేష్, డబ్ల్యూ హెచ్‌ఓ కన్సల్టెంట్ రాజ్ కిరణ్, ఎన్‌సీడీ కన్సల్టెంట్ భగీరధి, ఎన్‌సీడీ, ఆర్.బి.ఎస్.కె నోడల్ అధికారి వాణిశ్రీ, డాక్టర్ ఆనందమోహన్, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

### ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డికి కలెక్టర్ అభినందన



క్రీడాకారుడు శివారెడ్డిని సన్మానిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

**ఒంగోలు సిటీ:** ఢిల్లీలో జరిగిన మొట్టమొదటి ఖోఖో ప్రపంచ కప్‌లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించిన ఏకైక క్రీడాకారుడు, ప్రకాశం జిల్లా ఎస్.ఆర్.ఆర్ ఖోఖో అకాడమీ క్రీడాకారుడు, ఈదర గ్రామానికి చెందిన శివారెడ్డి మంగళవారం ఉమ్మడి ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కుర్ర భాస్కరరావు, మమతా ఫౌండేషన్ నిర్వాహకులు శ్రీనివాస రెడ్డి, ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రీడా అధికారి రాజరాజేశ్వరి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ తమీమ్‌అన్సారియా చేతుల మీదుగా శివారెడ్డిని సన్మానించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రపంచ కప్ లాంటి ప్రతిష్టాత్మకమైన టోర్నమెంట్ లో పాల్గొని బంగారు పతకం సాధించడం గర్వకారణం అని, శివారెడ్డిని ఆదర్శంగా తీసుకొని రానున్న రోజుల్లో యువత కూడా ఇటువంటి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

### మస్తాన్ వలీకి ఇన్నోవేటివ్ ఎంటర్‌ప్రెన్యూర్ జాతీయ ఐకాన్ అవార్డు




అవార్డు అందుకుంటున్న మస్తాన్ వలి


**తాళ్లూరు:** మండలంలోని తూర్పు గంగవరానికి చెందిన షేక్ మస్తాన్ వలీ ఇన్నోవేటివ్ ఎంటర్‌ప్రెన్యూర్ జాతీయ ఐకాన్ అవార్డు ఢిల్లీ టుడే మేనేజ్‌మెంట్ సంస్థ చేతుల మీదుగా అందుకున్నారు. ఢిల్లీలో సోమవారం నిర్వహించిన భారత విజనరీ లీడర్స్–2025 సమ్మిట్‌లో వివిధ రంగాలకు చెందిన 500 మంది విజనరీ లీడర్స్ పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో పాల్గొన్న మస్తాన్ వలీ పెయింటింగ్, వాటర్ ప్రూఫింగ్ బిజినెస్‌లో ఉన్నతమైన ఆలోచనకు గాను ఈ అవార్డు అందుకున్నారు. ఈ సమ్మిట్‌లో ఎంపీ పుష్ప యాదవ్, అరవింద్ గణపత్ సావంత్, ధరమీవర గాంధీ, పలువురు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

# పరీక్ష పే చర్చలో సహస్ర

- ఒంగోలు పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినికి అరుదైన అవకాశం
- పర్యావరణంపై ప్రధాని మోదీని ప్రశ్నించిన విద్యార్థిని సహస్ర
- మంచి ప్రశ్న వేశావంటూ ప్రధాని ప్రశంస



కుటుంబ సభ్యులతో సాయి సహస్ర



సాయిసహస్రని సన్మానిస్తున్న పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు



ప్రధాన మంత్రి నరేంద్రమోదీ తో మాట్లాడుతున్న సాయి సహస్ర

**ఒంగోలు సిటీ:** విద్యార్థుల్లో పరీక్ష ఒత్తిడి నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యంగా ఏటా 'పరీక్ష పే చర్చ' పేరుతో ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులతో ముచ్చటిస్తున్నారు. అందులో భాగంగా ఢిల్లీలోని సుందర నర్సరీలో సోమవారం పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన రాష్ట్రం తరపున ఒంగోలు నగరంలోని పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని నగరికంటి సాయి సహస్ర పాల్గొంది. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సహస్ర ప్రధానితో మాట్లాడింది. ''ఇటీవల కాలంలో వాతావరణంలో మార్పులు వేగంగా చోటు చేసుకుంటున్నాయని పుస్తకాల్లో చదివాం.. మనం ఏమీ చేయలేమా ?'' అని మోదీని ప్రశ్నించింది. మంచి ప్రశ్న వేశావని ప్రధాని విద్యార్థినిని అభినందించారు. దానికి ఆయన సమాధానమిస్తూ ''వాతావరణం గురించి దేశంలోని పిల్లలు ఆందోళన వ్యక్తం చేయడం సంతోషకరం. ప్రకృతి విధ్వంసం మన సంస్కృతి కాదు. లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అనేది నా మిషన్. అంటే ప్రకృతిని రక్షించడమే మన జీవన శైలిగా మార్చుకోవడం. భారత్‌లో అమ్మ పేరిట ఒక చెట్టు (ఏక్ పేడ్ మాకే నామ్) కార్యక్రమం జరుగుతోంది. అమ్మ జ్ఞాపకార్థం ఒక మొక్క నాటాలి. దానిని జాగ్రత్తగా చూసుకోవాలి. పెద్ద సంఖ్యలో ప్రజలు మొక్కలు నాటితే వాటితో వారికి అనుబంధం ఏర్పడుతుంది. ప్రకృతి రక్షణకు అది తోడ్పడుతుంది'' అని చెప్పారు.

**జిల్లాలో 18,700 మందిలో సహస్ర ఎంపిక:**

ఒంగోలుకు చెందిన న్యాయవాది నగరికంటి శ్రీనివాసరావు, జ్యోతి దంపతుల కుమార్తె అయిన సహస్ర వేలాది మంది విద్యార్థులతో పోటీపడి ఈ అవకాశాన్ని దక్కించుకుంది. ప్రధానితో నేరుగా మాట్లాడే అరుదైన అవకాశం కల్పించే పరీక్ష పే చర్చ కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పోటీపడుతుంటాయి. రాష్ట్ర వ్యాప్తంగా 21 లక్షల మంది ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో మన జిల్లా నుంచి 18,700 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. వీరందరూ పరీక్షాపే చర్చ కార్యక్రమం వలన ఎటువంటి ఫలితాలు ఉంటాయి అనే అంశంపై ఒక్క నిమిషం పాటు వీడియో తీసి పంపాలి. ఈ వీడియోలను పరీక్ష పే చర్చ నోడల్ ఆఫీసర్ ఎంపిక చేస్తారు. ఇలా ఎంపిక చేసిన అమ్మాయికి లేదా అబ్బాయికి పాఠశాలలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఈ దఫా మన రాష్ట్రవ్యాప్తంగా పరీక్షాపే చర్చ కార్యక్రమానికి నలుగురే ఎంపికయ్యారు. అందులో సాయి సహస్రకు మాత్రమే ప్రధానితో మాట్లాడే అవకాశం చిక్కింది. జనవరి 23 వ తేదీ రాష్ట్ర బృందంతో కలిసి ఢిల్లీలో అడుగుపెట్టింది. అక్కడ జనవరి 26 గణతంత్ర దినోత్సవం పరేడ్ చూసే అవకాశం కూడా ఈ బృందానికి కల్పించారు. దేశవ్యాప్తంగా 36 మంది ప్రధానమంత్రి తో మాట్లాడేందుకు అవకాశం కల్పించగా అందులో కేవలం 18 మంది మాత్రమే మాట్లాడారు. అందులో సహస్ర హిందీలో మాట్లాడుతూ తొణకకుండా, బెదరకుండా చక్కటి ప్రశ్నను సంధిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ నుంచి సమాధానం రాబట్టేలా చేసింది. ఇందుకు సరైన శిక్షణ ఇచ్చిన పరీక్షా పే చర్చ జిల్లా నోడల్ అధికారి మైనంపాడు ప్రిన్సిపల్ సామా సుబ్బారావు, పాఠశాల హెచ్‌ఎం బంకా లక్ష్మీ ప్రసన్న, తల్లిదండ్రులను మిగతా ఉపాధ్యాయులు, అధికారులు అభినందించారు.



## క్లుప్తంగా

### నెట్‌బాల్ జూనియర్ జట్ల ఎంపిక


జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

దొనకొండ: ఉమ్మడి ప్రకాశం జిల్లాస్థాయి జూనియర్ నెట్‌బాల్ బాలురు, బాలికల జట్ల ఎంపిక మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రకాశం జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కార్యదర్శి ఐపీ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. వచ్చిన క్రీడాకారులతో ఆటలు ఆడించి జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ నెల 16 నుంచి ఈస్ట్ గోదావరి జిల్లా రావులపాలెంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నరసింహారావు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గోలి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### తండ్రిపై కొడుకు గొడ్డలితో దాడి

చీమకుర్తి రూరల్: డబ్బులు అడిగితే ఇవ్వలేదన్న ఆక్రోశంతో తండ్రిపై కన్న కొడుకు గొడ్డలితో దాడికి తెగబడ్డాడు. ఈ దుశ్చర్య చీమకుర్తి మండలంలోని బండ్లమూడి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వనిపెంట లక్ష్మారెడ్డి, కుమారుడు రాజశేఖర్‌రెడ్డి మధ్య కొద్ది కాలంగా ఆర్థిక విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో మంగళవారం తండ్రిని డబ్బులు అడగ్గా ఇవ్వకపోవడంతో రాజశేఖరెడ్డి గొడ్డలితో దాడి చేశాడు. వెంటనే స్పందించిన స్థానికులు దాడిని అడ్డుకున్నారు. గాయపడిన లక్ష్మారెడ్డిని 108లో ఒంగోలు తరలించారు. తండ్రిపై దాడి చేసిన కుమారుడిని చీమకుర్తి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

అది ఏళ్ల తరబడి నష్టాల్లో కునారిల్లుతున్న సంస్థ.. రైతులకు సేవ చేస్తున్నా అనుకున్న ఫలితాలు రావడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఆ సంస్థపై ప్రత్యేక దృష్టి సారించింది. అప్పటి వరకు టీడీపీ పాలక మండలి చేతిలో ఉన్న ఆ సంస్థను వైఎస్సార్ సీపీ హస్తగతం చేసుకుంది. అదే ది ఆంధ్రప్రదేశ్ పొగాకు, వ్యవసాయ ఉత్పత్తుల సహకార సమాఖ్య. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాక ముందు వరకు దాదాపు రూ.37 లక్షల అప్పుల్లో ఉన్న ఈ సంస్థ నేడు రూ.4 కోట్ల లాభాల్లో కొనసాగుతోంది. నేటితో సమాఖ్య కమిటీ కాలపరిమితి ముగియనున్న నేపథ్యంలో లాభాల ప్రస్థానం, రైతులకు అండగా నిలిచిన వైనంపై ప్రత్యేక కథనం..

# అన్నదాతలకు సహకారం సంపూర్ణం




నాగులుప్పలపాడులో ఏర్పాటు చేసుకున్న గోడౌన్, కార్యాలయం

- రైతులకు దన్నుగా నిలిచిన పొగాకు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య
- రూ.37 లక్షల అప్పు నుంచి రూ.4 కోట్లు లాభాల్లోకి..
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే సాధ్యమైందంటున్న రైతులు
- జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సొంత గోడౌన్ల నిర్మాణం
- డీసీఎంఎస్‌లో అక్రమాలతో ఎరువుల పంపిణీ బాధ్యత సమాఖ్యకు అప్పగింత
- నేటితో ముగియనున్న సమాఖ్య కమిటీ కాల పరిమితి

ఒంగోలు సబర్బన్:

సిండికేట్ వ్యాపారులు, దళారుల చేతిలో రైతులు మోసపోకుండా చూడటంతోపాటు మార్కెట్ సంక్షోభంలోనూ పొగాకు, వ్యవసాయ ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య అండగా నిలిచింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఎరువులు, పురుగుమందులు అందజేయడమే కాకుండా ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులను కల్లాల వద్దే కొనుగోలు చేసింది. 2019కు ముందు వరకు అప్పుల్లో కూరుకుపోయిన ఈ సంస్థ వైఎస్సార్ సీపీ హయాంలో మాత్రంలో లాభాలతో వర్ధిల్లింది. 2019 జూన్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు వాకా బసివిరెడ్డి చైర్మన్‌గా నూతన కమిటీని అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 2020 ఫిబ్రవరి 13న నిర్వహించిన ప్యానెల్ ఎన్నికల్లో వాకా బసివిరెడ్డి ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ పాలనలోనూ రైతులకు చేదోడు వాదోడుగా నిలిచిన సమాఖ్య ఐదు సంవత్సరాల కాల పరిమితి బుధవారంతో ముగియనుంది. కూటమి ప్రభుత్వం నూతన సమాఖ్య ఏర్పాటుకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.


త్రిపురాంతకంలో సిద్ధం చేసుకున్న సొంత స్థలం

**నష్టాల బాట నుంచి లాభాల్లోకి..**

2020 ఫిబ్రవరికి ముందు సమాఖ్య రూ.36,69,019 నష్టాల్లో కూరుకుపోయింది. అయితే వైఎస్సార్ సీపీ హయాంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, మార్క్‌ఫెడ్‌తో ఒప్పందాలు చేసుకున్న సమాఖ్య రైతులకు అన్ని రకాలుగా సేవలందించేందుకు ముందుకొచ్చింది. 76.5 కోట్ల విలువైన ఎరువులు, పురుగుమందులను కంపెనీల వద్ద టోకుగా కొనుగోలు చేసి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రైతులకు సబ్సిడీపై అందజేసింది. నేరుగా పొలం వద్దకే ఎరువులు సరఫరా చేయడం, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు 79 వేల టన్నుల ధాన్యం, 29 వేల టన్నులకు పైగా శనగలు, కందులు, అలాగే మినుము, పత్తి, ఇతర ఉత్పత్తులను కల్లాల్లోనే కొనుగోలు చేయడం, రైతులకు సకాలంలో నగదు చెల్లించడం ద్వారా సమాఖ్య రైతుల అభిమానాన్ని చూరగొంది. ఈ క్రమంలోనే కమీషన్ రూపంలో రూ.4 కోట్లకు పైగా ఆదాయాన్ని సమాఖ్య సమకూర్చుంది.

**నాగులుప్పలపాడులో రూ.2 కోట్లతో గోడౌన్**

సమాఖ్య ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు మండల కేంద్రంలో సొంతంగా స్థలాన్ని తీసుకుని దాదాపు రూ.2 కోట్లతో గోడౌన్ నిర్మించారు. ఆ ప్రాంత రైతులకు ఎరువులు, పురుగు మందులు అందుబాటులోకి తీసుకొచ్చారు. అదేవిధంగా అప్పటి రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ సహకారంతో త్రిపురాంతకంలో సమాఖ్య ఆధ్వర్యంలో బ్రాంచ్ ఏర్పాటు చేశారు. త్రిపురాంతకంలో అరెకరా స్థలంలో గోడౌన్‌తోపాటు బ్రాంచ్ కార్యాలయం ఏర్పాటుకు రంగం సిద్ధం చేశారు. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సహకారంతో చీమకుర్తి మండలం కేవీ పాలెంలో సమాఖ్య గోడౌన్, బ్రాంచ్ కార్యాలయం కోసం 50 సెంట్ల స్థలాన్ని కేటాయించారు. ఒంగోలు నగరంలో సమాఖ్యకు స్థలం కేటాయించాలన్న విజ్ఞప్తి ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

**రైతుల సేవలో సంతృప్తి**



సమాఖ్యను లాభాల బాటలో నడిపించి రైతులకు మెరుగైన సేవలు అందించడం సంతృప్తిగా ఉంది. రైతుల ప్రయోజనార్థం నాగులుప్పలపాడులో అరెకరా స్థలంలో సొంతంగా గోడౌన్ నిర్మించుకున్నాం. గోడౌన్ కోసం తొలుత 50 సెంట్ల స్థలాన్ని రూ.16.50 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశాం. తర్వాత రూ.51.30 లక్షలు వెచ్చించి గోడౌన్‌తో పాటు అక్కడే కార్యాలయం కూడా నిర్మించుకున్నాం. నాణ్యమైన ఎరువులు రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చాం. బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే సొంతంగా ఎరువుల గోడౌన్ నిర్మించుకున్నాం. ఒంగోలులో సమాఖ్య కార్యాలయం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– వాకా బసివిరెడ్డి, రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్య చైర్మన్

### కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య


శ్రీదేవి మృతదేహం

కురిచేడు: కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన స్థానిక షాదీఖానా సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్సై శివ కథనం ప్రకారం.. స్థానికంగా నివాసం ఉండే పెద్దిశెట్టి శ్రీదేవి (32) కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో పైకప్పునకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు పొగాకు పందిరి నుంచి ఇంటికి వచ్చి తలుపు తీసి చూసే సరికి ఆమె విగతజీవిగా వేలాడుతూ కనిపించింది. పెద్దిశెట్టి సాంబశివరావుకు పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం శానంపూడికి చెందిన శ్రీదేవితో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం కాపురం సజావుగా సాగింది. అనారోగ్యంగా ఉండటంతో భర్త పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయిస్తున్నాడు. సరైన వైద్యం అందించడం లేదని భార్య తరుచూ భర్తతో గొడవ పడుతుండేది. కొన్నిసార్లు మనస్తాపం చెంది పుట్టింటికి కూడా వెళ్లి పెద్ద మనుషుల పంచాయతీతో మళ్లీ వచ్చేది. ఇటీవల వినుకొండ పోలీసుల సమక్షంలో పెద్దలు సర్ది చెప్పి ఇద్దరినీ ఒకటి చేశారు. అయినా తిరిగి గొడవలు ప్రారంభం కావడంతో విరక్తి చెందిన శ్రీదేవి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివ తెలిపారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

### కణితి మాంసం కలిగిన వ్యక్తి అరెస్ట్

గిద్దలూరు రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలో కణితి మాంసం కలిగి ఉన్న వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని మంగళవారం సీఐ కె.సురేష్ అదుపులోకి తీసుకుని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కణితి మాంసం ఎలా వచ్చింది? ఎవరు ఇచ్చారు? అనే విషయాలపై అటవీశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

## భారీగా అక్రమ మద్యం స్వాధీనం

- రూ.1.32 లక్షల విలువైన 838 బాటిళ్లు, ట్రక్ సీజ్
- నిందితుడిని అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు


సాక్షి ఎఫెక్ట్..


సీజ్ చేసిన మద్యం, నిందితుడిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కొనకనమిట్ల: అక్రమంగా భారీ మొత్తంలో బెల్ట్ షాపులకు తరలిస్తున్న మద్యాన్ని మంగళవారం కొనకనమిట్ల సమీపంలో ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.1,32,260 విలువైన 838 బాటిళ్లు, మద్యం తరలిస్తున్న ట్రక్‌ను సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు పొదిలి ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. కొనకనమిట్ల మండలంలో అక్రమ మద్యం విక్రయాలపై ఈనెల 10న సాక్షిలో ×రండి బాబూ రండి.. మీ వీధిలోనే.. మీ ఇంటి వద్దే¤ శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఒంగోలు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ ఆర్.నరహరిరావు తమ బృందంతో నిఘా పెట్టారు. కొనకనమిట్ల నుంచి కాట్రగుంట వెళ్లే రోడ్డులో ఒక వ్యక్తి తన ట్రక్‌తో సహా పారిపోయే ప్రయత్నం చేయగా ఎక్సైజ్ పోలీసులు అడ్డుకుని తనిఖీ చేశారు. నిందితుడిని కొనకనమిట్లకు చెందిన వెంపటి రామచంద్రారెడ్డిగా గుర్తించారు. మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసి తాను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లుగా నిందితుడు అంగీకరించినట్లు ఎక్సైజ్ ఎస్సై తెలిపారు. మద్యాన్ని ల్యాబ్‌కు పంపుతున్నట్లు చెప్పారు.

## ఊరంతా పండగే..

- తమటంవారిపల్లిలో పల్లె జాతర
- 100 ఏళ్ల తర్వాత రాములవారి, పోలేరమ్మ గుడి పునఃనిర్మాణం


నూతనంగా నిర్మించిన రామాలయం

కనిగిరి రూరల్: సుమారు 100 ఏళ్ల తర్వాత ఆ ఊరిలో రాములవారి గుడి, పోలేరమ్మ గుడిల పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన ఆలయాలను ఊరంతా ఒక్కటై నిర్మించుకున్నారు. 41 రోజుల నిష్ఠ అనంతరం గ్రామంలో అభిషేకాలు నిర్వహించి మంగళవారం అమ్మవారికి (పోలేరమ్మ)కు పొంగళ్ల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇది మండలంలోని తమటంవారిపల్లిలో మంగళవారం జరిగింది. ప్రతి ఇంట్లో పండగ వాతావరణం నెలకొంది. వివరాలు.. గ్రామంలో 70 ఇళ్లు ఉంటాయి. సుమారు 500 మంది జనాభా. వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఇంటికి చేరారు. కుటుంబ సభ్యులతో పాటు వారి బంధుగణాన్ని కూడా ఆహ్వానించారు. గ్రామంలో ఉదయం నుంచే పండగ వాతావరణం నెలకొంది. అత్యంత నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పొంగళ్ల నైవేద్యం సమర్పించారు. చాలాకాలం తర్వాత ఎక్కడెక్కడి నుంచో ఊరికి చేరిన పల్లె జనం పలకరింపు.. ఊరంతా ప్రతి ఇంటి ముందు ఆరుబయట పొయ్యి పెట్టి వంటా వార్పు..ప్రతి ఇంట్లో భోజనాలతో సందడి వాతావరణం నెలకొంది.


పొంగళ్లకు కలశ ఊరేగింపులో మహిళలు

## ఇటుక బట్టీలకు చెరువు మట్టి


మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రం చెరువు నుంచి మట్టిని దర్శి ఇటుక బట్టీలకు అక్రమంగా తరలిస్తున్నారు. అనుమతుల లేకుండా సెలవు రోజుల్లో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. రాత్రి వేళల్లో మట్టి తరలించి పగటి పూట నిలిపేస్తున్నారు. పదుల సంఖ్యలో టిప్పర్లతో ఇటుక బట్టీల యజమానులు మట్టి తోలి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఇటుక బట్టీ యజమానులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో సంప్రదించి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చలానా కట్టి అనుమతులు పొంది మట్టిని ఇటుక బట్టీలకు తోలుకునే వారు. నేడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనుమతులు తుంగలో తొక్కి విచ్చలవిడిగా మట్టి తరలిస్తున్నారు. అధికారులు స్పందించి మట్టి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రుద్రసముద్రం గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ బి.రమాదేవిని వివరణ కోరగా చెరువు మట్టి తరలించే విషయం తనకు తెలియదని, రెవెన్యూ సిబ్బందిని పంపించి మట్టి అక్రమ తవ్వకాలు నిలిపేస్తామని చెప్పారు.

## మంచినీటి సమస్యను పరిష్కరించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వినతిపత్రం

ఒంగోలు సిటీ: వేసవి కాలం రాక మునుపే పశ్చిమ ప్రాంతంలోని ప్రజలు మంచి నీటి సమస్యను ఎదుర్కొంటున్నారని, మంచినీటి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ కోరారు. గిద్దలూరు, మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లోని భూముల్లో నీరు అడుగంటడంతో చాలా సంవత్సరాలుగా ప్రజలు నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నందున కూటమి ప్రభుత్వం కల్పించుకుని శాశ్వత ప్రాతిపదికన మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చెయ్యాలని కలెక్టర్ తమీమ్ అన్సారీయాను ఆమె ఆఫీసులో కలిసి అబ్దుల్ రజాక్ వినతిపత్రం అందజేశారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి అయితే మంచి నీటి కష్టాలు తీరుతాయని భావిస్తున్న ప్రజలకు నిరాశ, నిస్పృహలే మిగిలాయన్నారు. మార్కాపురం పట్టణ ఎంపీజే అధ్యక్ష, కార్యదర్శులు షేక్ నాగూర్ మీరావలి, సయ్యద్ మస్తాన్ వలి, ఒంగోలు నగర అధ్యక్షుడు షేక్ రవూఫ్ పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

నాగులుప్పలపాడు: బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చేకూరపాడు ఉన్నత పాఠశాలలో 50 శాతం మంది విద్యార్థులు కూడా లేనట్లు ఆమె గుర్తించారు. గైర్హాజరైన విద్యార్థులను గుర్తించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాగిపిండి, కోడిగుడ్ల స్టాక్ నిల్వలతో పాటు స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం తెలుగు వ్యాస రచనపై విద్యార్థులకు పరీక్ష పెట్టి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి బాలింతలు, గర్భిణులకు ఇచ్చే పౌష్టికాహార కిట్లు పరిశీలించారు. మద్దిరాలపాడులో అనుమతులు లేకుండా నడుపుతున్న శ్రీసూర్య హైస్కూల్ విద్యా సంస్థలకు నోటీసులు అందించాలని డీఈవోను ఆదేశించారు. ఆమె వెంట ఎస్‌డబ్ల్యూఓ వీరాంజనేయులు, మహిళా పోలీసు సిబ్బంది ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న బత్తుల పద్మావతి

## కనీస పెన్షన్ అందజేయాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ఒంగోలు సిటీ: కేంద్ర ప్రభుత్వం కనీస పెన్షన్‌ను తొమ్మిది వేల రూపాయలకు పెంచాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.శేషయ్య డిమాండ్ చేశారు. ఏడు నెలల కాలంలో పెన్షనర్ల సమస్యలు పరిష్కరించనందుకు నిరసనగా మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద పెన్షన్‌దారులంతా ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శేషయ్య మాట్లాడుతూ పెన్షనర్ల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. సీనియర్ సిటిజన్లకు రైల్వేలో గతంలో ఇచ్చిన ప్రయాణ రాయితీలను పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగుల సమ్మె హక్కును రాజ్యాంగబద్ధం చేయాలన్నారు. వేతన సవరణను ప్రతి ఐదేళ్లకోసారి చేయాలన్నారు. పెన్షన్ ప్రైవేటీకరణ చర్యలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో 50 లక్షల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో 2 లక్షల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర హైకోర్టు కమ్యూనికేషన్ కాలపరిమితిని తగ్గిస్తూ ఇచ్చిన స్టేను అర్హులకు ప్రభుత్వం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ధర్నాలో అసోసియేషన్ నాయకులు పుల్లారావు, పిచ్చయ్య, నారాయణ, టి.రామ్మూర్తి పాల్గొన్నారు.


यूनियन बैंक Union Bank of India

**టంగుటూరు మెయిన్ బ్రాంచి**
టంగుటూరు, ప్రకాశం జిల్లా-523274. ఫోన్స్ : 93953 95111.
ఇ-మెయిల్ : ubin0809837@unionbankofindia.bank

**ఇ-వేలం అమ్మకం ప్రకటన** (స్థిరాస్తుల అమ్మకము కొరకు)

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) చట్టం 2002లోని రూల్ 8 ప్రకారం స్థిరాస్తుల విక్రయానికి సంబంధించి 15 రోజుల నోటీసు.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టంగుటూరు మెయిన్ బ్రాంచి, టంగుటూరు** సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 సెక్షన్ 13(2) ప్రకారం **ది.01-12-2021**న డిమాండ్ నోటీసు జారీచేసియున్నారు. నోటీసులో పేర్కొన్న బకాయిలు నిర్దీత వ్యవధిలోగా తిరిగి చెల్లించుటలో మీరు విఫలమైనందున అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) చట్టం నందలి సెక్షన్ 13(4) ప్రకారం స్థిరాస్తులను స్వాధీనం చేసుకొనియున్నారు. సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) చట్టం 2002కి అనుబంధం IV ప్రకారం **ది.11-02-2022**న అధీకృత అధికారి జారీచేసిన స్వాధీనత నోటీసు మీకు అందజేయబడినది మరియు స్థిరాస్తి వివరాలు జత చేయబడిన అదే నోటీసు వార్తా పత్రికలలో ప్రచురింపబడినది. సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 సెక్షన్ 13(8) ప్రకారం డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయిలను చెల్లించి ఆస్తులను తిరిగి పొందే హక్కులను కలిగిఉంటారని గమనించగలరు.

ఋణగ్రహీత(లు)/ సహ-పూచీదారు(లు)/ తనఖాదారు(లు)/ హామీదారు(లు): **1) మెస్సర్స్ వెంకటేశన్ టుబాకో ట్రేడర్స్, యజమాని : శ్రీ వెంకటేశన్ జయకుమార్, తండ్రి : పోలినేని వెంకటేశన్**, 13-136, జి.టి. రోడ్డు, టంగుటూరు గ్రామము, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా - 523274. **2) శ్రీ వెంకటేశన్ జయకుమార్, తండ్రి : పోలినేని వెంకటేశన్**, 13-136, జి.టి. రోడ్డు, టంగుటూరు గ్రామము, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా - 523274. **3) శ్రీ పోలినేని వెంకటేశన్, తండ్రి : పి. చిన్నయ్య**, 2-97, జి.టి. రోడ్డు, టంగుటూరు గ్రామము, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా - 523274, **4) శ్రీమతి పోలినేని లక్ష్మి, భర్త : పోలినేని వెంకటేశన్**, 2-97, జి.టి. రోడ్డు, టంగుటూరు గ్రామము, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా - 523274, **5) మెస్సర్స్ సిఆర్‌ఆర్ ఆక్వా ఫామ్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరఫున మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ పోలినేని వెంకటేశన్**, 2-97, జి.టి. రోడ్డు, టంగుటూరు గ్రామము, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా - 523274, **6) శ్రీమతి జక్కంపూడి పద్మావతి, భర్త : సిద్ధయ్య నాయుడు(లేటు)**, డి.నెం.4-99, ట్రంక్ రోడ్డు, టంగుటూరు గ్రామము, టంగుటూరు మండలం, ప్రకాశం జిల్లా - 523274.

బకాయి మొత్తం: **రూ.19,83,68,521/-** (పందొమ్మిది కోట్ల ఎనభై మూడు లక్షల అరవై ఎనిమిది వేల ఐదు వందల ఇరవై ఒక రూపాయి మాత్రమే) అదనంగా తిరిగి పొందని వడ్డీ (ఏదైనా ఉంటే) మరియు తదుపరి వడ్డీ, ఖర్చు & ఖర్చులతో.

**వేలం తేది : 28-02-2025 & సమయం: మధ్యాహ్నం 12.00 గం.ల నుండి సాయంత్రం 5.00 గం.ల వరకు**

| ఆస్తి నెం. | రిజర్వుధర (రూ.) | ధరావత్తు ధర (రూ.) | బిడ్ పెంపుదల (రూ.) |
|---|---|---|---|
| 1 | రూ.2,59,86,000/- | రూ.25,98,600/- | రూ.2,59,860/- |
| 2 | రూ.4,18,23,000/- | రూ.41,82,300/- | రూ.4,18,230/- |
| 3 | రూ.41,82,000/- | రూ.4,18,200/- | రూ.41,820/- |

**స్థిరాస్తి వివరములు**

**ఆస్తి నెం. 1 :** టంగుటూరు, సర్వేనెం.631, డి.నెం.13-74 నందు శ్రీ పోలినేని వెంకటేశన్‌కు చెందిన 865.42 చ॥గ॥లు + 865.42 చ॥గ॥లు + 865.42 చ॥గ॥లు మొత్తం 2596.25 చ॥గ॥ల విస్తీర్ణముగల సెమి అర్బన్ కమర్షియల్ టుబాకో గోడౌన్‌కు సంబంధించి న్యాయసమ్మతంగా తనఖావుంచబడిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** ఈ ఆస్తికి మరియు కాకుమాని రామమోహన్‌రావు మొ॥ వారి యొక్క ఆస్తికి మధ్యగల ఉమ్మడి గోడ, **దక్షిణం :** కొండపి రోడ్డు; **పడమర :** ఈ ఆస్తికి మరియు బెల్లం కోటయ్య ఆస్తికి మధ్యగల ఉమ్మడి నడకమార్గం; **ఉత్తరం :** బెల్లం కోటయ్య యొక్క ప్రహరీగోడ.

**ఆస్తి నెం. 2 :** టంగుటూరు, టుబాకో బోర్డ్ ఆక్షన్ ప్లాట్‌ఫామ్‌కు దగ్గర గల రైల్వే గేటు జిటి రోడ్డు, యస్.నెం.707, యస్.నెం.705/ఎ, యస్.నెం.712/బి మరియు డి.నెం.13-39, 13-39/1, 13-39/2 నందు శ్రీ పోలినేని వెంకటేశన్‌కు చెందిన 7453.60 చ॥గ॥ల విస్తీర్ణముగల సెమి అర్బన్ స్థలము మరియు అందులోని కమర్షియల్ గోడౌన్/ బిల్డింగ్స్‌కు సంబంధించి న్యాయసమ్మతంగా తనఖావుంచబడిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** రైల్వే ట్రాక్, **దక్షిణం :** పమిడి పుల్లయ నాయుడు యొక్క భూమి; **పడమర :** ట్రంక్ రోడ్డు; **ఉత్తరం :** పోకూరి వెంకటేశ్వర్లు యొక్క భూమి.

**ఆస్తి నెం. 3 :** టంగుటూరు, యస్.నెం.1242/2 నందు శ్రీమతి పోలినేని లక్ష్మి, భర్త : పోలినేని వెంకటేశన్, నివాసము : టంగుటూరుకు చెందిన 425.2/9 చ॥గ॥ల విస్తీర్ణముగల ఇంటి స్థలము మరియు అందులో 1042 చ॥అ॥ల విస్తీర్ణములో నిర్మించిన ఆర్‌సిసి బిల్డింగ్‌కు సంబంధించిన యావదాస్తి. **దీనికి హద్దులు : తూర్పు :** పంచాయతి బజారు, **దక్షిణం :** పంచాయతి బజారు; **పడమర :** చీమకుర్తి శ్రీనివాసరావు యొక్క స్థలము; **ఉత్తరం :** మండవ వాసుదేవ యొక్క స్థలము.

ఏదైనా ఇతర వివరాల కోసం ఫోన్ నెం.8291220220 & మెయిల్ ఐడి: support.BAANKNET@psballiance.com సంప్రదించగలరు. రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ నియమాల కొరకు కొనుగోలుదారులు https://baanknet.com హోమ్ పేజీను సందర్శించగలరు. వేలమునకు సంబంధించి మరేదైనా ఇతర వివరముల కొరకు బ్రాంచ్ మేనేజర్ శ్రీ చిల్లా శ్రీనివాసరావును వారి ఫోన్ నెం. 93923 95111 & మెయిల్ ఐడి: ubin0809837@unionbankofindia.bank నందు సంప్రదించగలరు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 15 రోజుల అమ్మకం నోటీసు
చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకము నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీతలు, హామీదారులకు మరియు తనఖాదారులకు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6)/రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

ప్రదేశం : టంగుటూరు, తేదీ : 07-02-2025 సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టంగుటూరు మెయిన్ బ్రాంచి, ప్రకాశం జిల్లా.



సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE
■కేవలం 7.5 ఎకరాల 25 సెంట్ల భూమి 100 ... 96661 66407, 96031 84207 [B-1266831]

Services

BUSINESS OFFER
■... 8376001873, 98430 10487, 8376089771, 011-25920179 [DA-6200]

Marriage Links
■రెడ్డి మ్యారేజ్ లింక్స్: ... 96429 71104. [O-190087]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలను చదివి, వాటిని నమ్మి పాఠకులు ... సంప్రదించి ... పాఠకులు గమనించగలరు.

Wanted

■Comfort Inn Hotel ట్రంక్‌రోడ్, ఒంగోలు నందు పనిచేయుటకు రూమ్ బాయ్స్ మరియు సెక్యూరిటీ గార్డులు కావలెను. సంప్ర: 94912 40500. [O-190092]

■... 91608 35559, 78158 35561 [B-466]

■... 7702874233, 9640141999 [B-07246]

■Secur Security Services ... 95595 98279. [NA-24027]

■... 18K. ... 9640400073 [HA-1400]

■Universal కంపెనీ ... 25,000 నుండి 30,000 వరకు ... 95027 12418. [SCA2501644]

■Wanted Teachers to Teach Telugu, Maths, English, Science for 3rd to 7th Classes. PRO's for Hostel Admissions and Lady P.E.T. Sri Ram Olympiad School, Kurnool Road, Ongole. ✆ 98491 07773 [O-190091]

క్లాసిఫైడ్స్
క్లాసిఫైడ్స్ : ఒంగోలు
90102 02762